# అంధమాత

శ్రీ కె. లింగరాజు

మరియమ్మ కూడా వున్న ఇక రెండు మూడునెలల్లో రెండేళ్ళూనిండే కొడుకు జాన్ చెయ్యి పట్టుకు నడిపిస్తూ, ఆయాభుజాన్ని ఆనుకొని చర్చినుంచి వచ్చేసింది. ఇంటికి. ఇంటిగుమ్మంలోకి రావడంతోటే తండ్రి జకరయ్య "వచ్చేవా అమ్మా" అంటూ ఆదరించి లోపలికి తీసికెళ్ళేడు. అది ప్రథమంగా, జాన్ పుట్టినతర్వాత చర్చికి వెళ్ళటంచేత.

నడిచొచ్చిన ఆయాసంచేత ఉస్సురంటూ కూలబడిపోయింది కుర్చీలో కొంతసేపటి వరకూ మరియమ్మ. కొంచెం నెమ్మగిల్లిన తర్వాత "బాబాయి! జాన్ ఆ చర్చిలోకి వచ్చినప్పటినుండీ, అందర్నీచూస్తూ, వింతగా పరికిస్తూ ఆనందించేడు కాబోలు. ఆపిల్లల్ని అందర్నీచూచి ఒక్కసారిగా దడుసుకోలేదుకాదా?" అంది.

'ఆ! అవును చూచి వుంటాడు. ఏమి ఆయా! దడుసుకొన్నాడా ఏమైనా?' అన్నాడు జకరయ్య ఆయాకేసి మొఖం తిప్పుతూ.

"లేదుబాబూ, అందర్ని చూచి ఎంతోసేపు నవ్వేడు. ఆచర్చిలోనున్న ఆ ప్రభువు రంగు రంగులగాజు బొమ్మచూచి....పా పా యి అన్నాడు కూడాను." అంది అనునయంగా.

"ఆ! అల్లాగా! ఏసుదేవుని చూచేడా! ఆయా! ఇంకా ఏంచేసేడు?" మరియమ్మ సంతోషంలో అంది.

"చూచేడమ్మా చాలా సేపటికి వర్కూ దాన్నే చూస్తూ నవ్వుతూ వున్నాడమ్మా"

"ఇదివరకెప్పుడూ జాన్ అంతమంది పిల్లల్ని ఒక్క[illegible] చూచి వుండలేదు. ఒక్కసారి చూచినప్పుడు, కొంచెం భయపడ్డాడుకాబోలు..భయపడ్డాడనే అనుకొంటాను అప్పుడు నాచీర వెనకాల దాచుకొన్నట్టుగా వచ్చేడు....నీవు చూచేవా ఆయా"

"లేదమ్మా! అయితే అయివుండవచ్చును" అంది తప్పనిసరిగా, ఆమాటలు కాసినిఅయిన తర్వాత తన పనులు చక్కపెట్టుకొందుకు లోపలికి వెళ్ళిపోయింది.

జాన్‌కూడ అంతవర్కూ ఈ కుర్చీకి ఆ కుర్చీకి మధ్యన కూర్చుండి అప్పుడే వచ్చినట్టుగానున్న న్యూస్‌పేపర్నుచించి పదిలంగా ముక్కలు చేస్తూ, తనమీద వేసుకొంటూ ఎగురగొట్టుకుంటూ, కిలకిలమంటూ కూర్చునాడు.

వస్తూవస్తూ దార్లో ఓకొట్టులో కెళ్ళి మనమడికి ఓరబ్బరు బొమ్మ కొనితెచ్చేడు జకరయ్య. దాన్ని ఇప్పుడు బయటకు తీసి, కీచుకీచు మనిపిస్తూ "బాబాయి! జాన్ బొమ్మ ఇదిగో! .... రావాలి .... రావాలి" అంటూ ఊదించేడు. దాంతో ఇంతవరకూ కాగితంతో యుద్ధము కట్టిపెట్టి గబాగబా "పాపాయి! పాపాయి" అంటూ తాత చేతుల్లోకి వచ్చేసేడు. ఆబొమ్మను తన రెండు చేతుల్తోను నొక్కుతూ, దాని కీచుకీచుల్లో తన కిలకిలలు కలిపేసేడు.

"బాబాయి! బొమ్మ కొన్నావా" అంది మరియమ్మ.

"ఊ"

"ఏం బొమ్మ బాబాయి! దొరబొమ్మా? దొరసానిబొమ్మా? లేకపోతే ఇంకేబొమ్మ బాబాయి?" ఆతృతతో

"దొరసానిబొమ్మ అమ్మా! దారిలోవస్తూ కొన్నాను" అన్నాడు జకరయ్య. అమ్మా! పాపాయి! కీ....కీ...." అంటూ జాన్ తల్లి వళ్ళోకివచ్చి ఆబొమ్మను మరంత కీచుమనిపించేడు.

మరియమ్మ రెండు చేతుల్తోను జాన్‌ను తీసుకొని ఆతని మొఖాన్ని చేర్ల పరిచింది. తన....కళ్ళే వుంటే, అపూర్వ ఆనందంతో తొలకసలాడిపోయే మొఖాన్ని.

"బాబాయ్! ఏంచేస్తున్నాడు ఆబొమ్మతో. దాన్ని ఆడిస్తున్నాడా? జో కొడుతున్నాడా? బాబాయి"

ముసలి జకరయ్య మనమడి "జో.... పాపా....జో...." రెండుకాళ్ల మీద బొమ్మని పడుకోపెట్టి పాడుతున్న పాటలో మునిగిపోయేడు; తన కూతురి ప్రశ్నలు కూడా వినపడినంత ఆనందం ముంచేసింది. తన దగ్గరనుంచి వెళ్ళిన తర్వాత జాన్‌మాటలే ఆమెకు సమాధానమై పోయేయి. నవ్వింది. కాని తనకే కళ్లువుంటే....ఒక్కసారిగా ఆ ఆనందం తర్వాత దుఃఖం వచ్చేసింది. కుమిలి పోయినట్లుగా అయి పొయింది.

"బాబాయి" రుద్ధంగావచ్చేయి ఆమాటలు.

"ఆ! ఏమమ్మా! ఏమైనా కావాలా?" ముసలివాని గుండె ఒక్కసారిగా ఆగిపోయేటట్లు అయిపోయింది ఆ స్వరంలోని భేదం

"బాబాయి...." చెప్పలేక పోయింది.

"చెప్పమ్మా....ఎంకావలో చెప్పమ్మా.... నాతల్లి వికావూ" జకరయ్య కంఠం ఆతృత ప్రకటించేసింది. అందులో దుఃఖం విచారం కూడా జారగా కనుపించేయి.

"నేను ఇంకెప్పుడుకూడా జాన్ మొఖం చూడలేను కాబోలు. అందరూ నా జాన్ చూడకల్గుదురుగాని నేను చూడ లేను కాబోలు" అంది. ఆ అండంతోటే కన్నీళ్ళు కూడా వెనువెన్కీ తిరిగిపోయేయి ....ఆమె ఆశ—దాని ఫలితం అన్నట్లుగా చినుకు చినుకులైపోతూ.

ముసలి జకరయ్య హృదయం ఒక్కసారిగా ప్రక్కలై పోయింది. ఒక్కసారిగా తను జీవించి యుండగా తన కూతురి కష్టాలు చూడవలసి వచ్చిందికదా; అన్న దుఃఖం ఎక్కువై పోయింది. తను ఏమీ చెప్పలేక రెండు కళ్లూ తుడిచేసుకొన్నాడు.

"అమ్మా! పాపాయి! పాపాయి—గుర్-గుర్" అన్న జాన్ మాటలు వారిద్దర్నీ ఒక్కసారిగా ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చేయి. దగ్గరసా వెళ్ళి జకరయ్య మనుమణ్ణి చేతుల్తో తీసుకొని, ఆ కన్నీళ్ళ కళ్ళతోనే ముద్దాడేడు. ఆ చేతుల్లోని బిడ్డణ్ణి మరియమ్మకిస్తూ "జాన్ పెద్దవాడవుతున్నాడు సుమీ;" అన్నాడు.

"పెద్దవాడవుతున్నాడా?"

"అవునమ్మా"

"అయితే అతని కళ్ళు, ముక్కు, చేతులు, ఇవన్నీ పెద్దపెద్దవిగా అయిపోతున్నాయన్నమాట. బాబాయి: పళ్ళు ఇంకేమయినా వస్తున్నాయా?"

"లేదు అమ్మా"

"బాబాయ్....జాన్....జాన్ నా పోలికేనా?"

"ఉ....కాని ఒకొక్కప్పుడు ఇంకో కొత్త ముఖం చూస్తూ వుంటానమ్మా"

"ఇంక మరియమ్మ మాట్లాడలేక పోయింది. చాటుగుండా ముఖం తిప్పేసుకొంది....

* * *

మరియమ్మ జకరయ్యకు ఒక్కర్తే కూతురు. తల్లి పోయింతర్వాత ఆమెను ఎంతో గారాబంతో ప్రేమతో పెంచి పెద్దదాన్ని చేసేడు. ఆమె ఆనందమే తన ఆనందమనకుని, ఆమె నవ్వే తనకు సంతోషమని, ఆమెకోసం కావలసిందల్లా త్యాగంచేసి, ఆ ముసలికాలంలో చీకు చింతాలేకుండా కాలం గడుపుకొనేవాడు. తాను త్యాగంచేసి ఆమెను సుఖపరుస్తే పైన దేమునిదగ్గరనున్న తల్లి ప్రాణం సంతోషిస్తుంది కదా అని అనుకొని చాకిరీచేస్తూయుండేవాడు.

మరియమ్మ యుక్తవయస్సు వచ్చినప్పటి నుండీ, తనయింటికి ఎదురుగావున్న లూక్‌ను చూడకుండా యుండలేకపోయేది. లూక్ తనకంటె రెండు మూడేళ్ళు పెద్దవాడు. వాళ్ళు కొంచెం డబ్బున్నవాళ్ళు....అతని అందం చూచి, తను అతన్ని ప్రేమించకుండా వుండలేకపోయేది. లూక్‌కూడా ఆమెకు తన వంపుసొంపుల్తో సేవచేసి సుఖపడి ఏవో ఏవో కలలుకంటూ యుండేవాడు. అల్లా వారిదురూ వుండడం—చూచి జకరయ్య ఇద్దరూ పెళ్ళిచేసుకొంటారేమో అనుకొని తృప్తి, ఆనందంపడి, వెన్నువిరచుకొనేవాడు.

జాన్ ఇంక కొద్దినెలలకు పుడతాడనగానే, తెలియకుండా - ఆమె కళ్ళు రెండూ చూపుకు దూరమై పోయేయి. ఆ జరగడం అకస్మాత్తుగాను, కొంచెమైనా సూచన లేకుండాను జరిగింది. ముందర కొంచెం కొంచెంగా నీళ్లు కారడం, తర్వాత ఎరుపెక్కడం, కొన్నిరోజులైనతర్వాత పూర్తిగా గ్రహణంపట్టినట్లుగా-అయి చూపుపోయింది. దానికి మొదటి రోజుల్లో మరియమ్మా, జకరయ్యాకూడా ఎంతో విచారించేరు.

ఆదే సందుచేసుకొని, ఎల్లాగైనా తప్పించుకొందామని చూస్తున్న లూక్, సరాసరీ అయిపోయి, చెంపపెట్టుక్రింద వీళ్ళిద్దరకూ చేసేసి మాయమై పోయేడు.

మొదటి రోజుల్లో డాక్టర్లకు చూపిస్తే, ఇప్పుడప్పుడే కళ్ళు శస్త్రానికి పక్వమవవు, అని చెప్పడంచేత, వాళ్ళు, ఆదినానికే ఎదురుచూస్తూ, ముత్యపు చిప్పల్లా ఉండిపోయేరు.

అల్లా తీరని దుఃఖముతో కాలాన్ని త్రోసిపుచ్చుకొన్నారు.

* * *

అనుకొన్న ప్రకారం డాక్టర్లు, ఆపరేషన్ చెయ్యడానికి కత్తులూ కటార్లు, లినెన్లు, వింటులు, మందులు, మాకులూ తెచ్చుకొని సిద్ధమయ్యేరు. వాళ్ళ శబ్దాలకు చప్పుళ్ళకు మరియమ్మ కొంచెం భయపడింది. ఎవరో కొత్తవారు వచ్చేరే, అని వాళ్ళకేసి వింతగా చూస్తూ కాళ్ళదగ్గర అల్లాడుతున్న జాన్‌ను తీసుకొని భుజంమీద వేసుకొంది. ఆభుజం మీదనుంచే చాటుచాటుగా ఆ నల్లని గ్రుడ్లల్లోంచి ఆ డాక్టర్లను చూడ్డంతోటి, అతని గొంతుకలోంచి వచ్చే మాటలుకూడా చప్పబడిపోయేయి.

"అన్నీ సిద్ధంగా వున్నాయి. ఆమెను ఆగదిలోకి తీసుకువెళ్ళండి" అన్నాడు డాక్టరు మేరీకేసి చూస్తూ.

మేరీ, మరియమ్మ చిన్నప్పటినుండీ ప్రాణ స్నేహితులు. కష్టసమయంలో ఆదరాగా వుంటుందని ఆమె ఇక్కడే వుండిపోయింది. అకస్మాత్తుగా మరియమ్మను భయం చుట్టివేసింది. వళ్ళంతా వణికిపోయినట్లయ్యింది. దాంతో.

"వెళ్ళను. నేను చేయించుకోను" అంది.

"మరూ; మళ్లీ అల్లా అంటావే; నీకొడుక్కోసం, వాడిని అలించడానికి, పెంచడానికి కోసం చేయించుకోవూ" ప్రాధేయ పడింది మేయర్.

"రెండేళ్ళనుంచి, నీకు అసలే కన్పట్టం లేదు. చీకట్లో వున్నావు. ఇప్పుడు కొంచెం నీకు నెప్పి కల్గించుటవల్ల, ఆపోయిన దృష్టిని మళ్లీ ఇవ్వకల్గుతాము. ఆమాత్రము నొప్పిని భరించలేవా అమ్మా! దాన్ని ఓర్చుకోలేవా? ఎందుకంత భయపడుతావు" అన్నాడు డాక్టరు.

మరియమ్మ ఏమీ చెప్పలేకపోయింది. తన కొడుకును హృదయానికి హత్తుకొని ముద్దుల్తో నింపేసింది.

"కొంచం ఆలోచించుకో! ఆపరేషన్ లేకుండా నీకళ్ళు నీకు రావమ్మా. దీనివల్ల నీకు పోయేది లేదూ గడించేదీ లేదూ! ఏమమ్మా, ఏమంటావు? పదమ్మా." మళ్ళీ అన్నాడు డాక్టరు.

"ఓ! జా!" అని ఆ రుగ్ధకంఠంలోంచి వెలువడ్డాయి క్రియాసూన్యతతో.

"కొద్ది నిముషాల బాధయేనమ్మా! అదైనా నీకు పొందుతున్నట్టుగా తెలియదమ్మా. నీకు ఏం చేస్తున్నారో తెలియకుండానే చేయబడు తుందమ్మా"

మరియమ్మ మరంత దగ్గరసా జాన్‌ను తీసుకొని, గట్టిగా ఒత్తేసుకొంది. కాని కదల లేకపోయింది.

"ఏమిటో అంత పిచ్చి మమకారం" అన్నాడు కొంచం కోపంతో డాక్టరు. "ఆమె కళ్ళు ఎందుకూ పనికిరావని తెలుసున్నా, పోతాయేమో అన్న భయం ఎందుకు?"

"అది కాదు" చటుక్కున అటు తిరుగుతూ మరియమ్మ తీక్షణంగా.

"అది కాదండి. మీరు తప్పభిప్రాయ పడుతున్నారు. ఆమెతో ప్రాణభయం ఏమీ లేదని చెప్పండి" అంది మేయర్.

"ఓ! అల్లాగా, దానికేముంది. ఘంటా పడంగా పోత కాము" అన్నాడు డాక్టరు.

"తల్లి హృదయంలోని ప్రేమ అల్లా అనిపిస్తుందండి" అన్నాడు జకరయ్య. నవ్వు కొన్నారు.

"రా, అమ్మా! రా!" అంటూ, ఆపరేషన్ గదిలోకి తీసుకెళ్ళి మంచంమీద పడుకో పెట్టింది మేయర్. "కాస్సేపు కదలకుండా నిశ్శబ్దంగా వున్నావంటే అయిపోతుంది"

"ఓ! జాన్ నొకసారి తీసుకురా అమ్మా! ఒకసారి ముద్దుపెట్టుకొంటాను" అంది. ఆఖరుసారిగా కొడుకుని కావలించి తండ్రి కిచ్చేసింది.

"క్లోరో ఫారం ఇస్తే మంచిదేమో" అన్నాడు డాక్టరు కూడావున్న డాక్టరుతోటి.

"ఎవరది అంట?" అంది మరియమ్మ.

"ఓ! కొంచంసేపు మరి మీరు మాట్లాడ కుండా, హడావిడి చెయ్యకుండా వుండాలి"

"అల్లాగే, కాని నాకు క్లోరోఫారం ఇచ్చి మత్తుపుచ్చవద్దు. నిశ్శబ్దంగాఏమిచెయ్యమంటే అది చేస్తాను. నేను ఏడ్వను. అల్లరిచెయ్యను. మాట్లాడను. ఒక్క మత్తుమందు మాత్రం ఇవ్వవద్దు" అంది తల్లి ప్రాణం.

"అల్లాగే" అన్నారు డాక్టర్లు ఆలోచించు కొన్న తర్వాత.

పరికరాలన్నీ సిద్ధపరచుకొన్నారు. టార్చి ఎడ్జెస్టు చేసుకొన్నారు. బేండేజీలతో చుట్టు కొన్నారు.

"మేరూ! ఇల్లారా! నాదగ్గరసా కూర్చో."

మేయర్ వచ్చింది. "ఏది నీచెయ్యి నాచేతులో వుంచు" ఆ పదివేళ్ళు ఒకళ్ళ వన్నట్లుగా బిగుసుకుపోయేయి.

ఆపరేషన్ ప్రారంభమైయ్యింది. ఆగదిలో ఒక్క నిశ్శబ్దమే మంత్రిత్వం పుచ్చుకొన్న ట్లుగా అయ్యింది. ఒకటి—రెండు—మూడు నిముషాలు గడిచేయి.

"ఇంకో నిముషంలో అంతా అయిపోతుంది" అన్నాడు డాక్టరు.

మేయర్ చేతిలో వేళ్ళు మరంత బిగుసు కొన్నాయి.

"డాక్టరు! డాక్టర్! నేను మిమ్మ చూడ కల్గుతున్నాను" ఒక్కొక్కమాటే వచ్చింది.

"ఊరుకో మాట్లాడకు" ఇంకో నిముషంలో కళ్ళకు కట్లు కట్టబడతాయనగా.

"డాక్టరు. డాక్టర్‌గారు. జాన్‌ను ఒక్కసారి చూడనివ్వండి"

"ఊరుకో! మాట్లాడవద్దని చెప్పలేదూ"

"ఓ డాక్టరు. ఒక్కసారండి. ఒక్క క్షణం అండి. మీ మొఖం చూస్తున్నానండి. అల్లాగే నా జాన్‌నుకూడా చూడనివ్వండి"

"ఇప్పుడప్పుడే కాదు, అది మంచిది కాదు"

"ఒక్క క్షణమేనండి. కనురెప్ప పాటండి. కళ్ళు కప్పెయ్యకండి, ఒక్కసారి ఆలోచించండి. ఇంతవరకూ నాకొడుకుని చూడలేదండి. చిన్నప్పుడు అందరి బిడ్డలను చూచేనండి. ఒక్కసారి నా అబ్బాయిని చూడనివ్వండి. ఒక్కసారియేనండి. డాక్టరు గారూ! జాన్‌వండి. నాప్రియమైన జాన్ నండి...."

"ఏమమ్మోయి. నీవు ఉద్రేకపూరితురాలివై పోతున్నావు. ఇప్పుడు సరిగ్గా వుండక పోతే ఇంకెప్పుడూ నీవు చూడలేవు సుమీ; విన్నావా?"

అల్లాగేనండి. సరిగ్గానే వుంటానండి. మంచిదానిలాగే ప్రవర్తిస్తానండి, కాని నాకు కళ్ళకి బేండేజీలు కట్టకండి, మా అబ్బాయిని చూచేవరకూ, మేయర్, ఒక్కసారి వెళ్ళి వాణ్ణి తీసుకురా అమ్మా! విన్నావా, వాళ్ళ తాతతోకలసి నవ్వుతున్నాడు. వెళ్లి

మేరూ! వెళ్ళవూ? మంచి డాక్టరుగారమ్మా! ఆయన ఏమీ అనరు. వెళ్ళవూ? నిన్ను కోప్పడరు వెళ్ళవూ? ఆయనతో చెప్పమ్మా ఒక్కసారి మా అబ్బాయిని చూస్తే నాకు త్వరగా మానుతుందని నీకు తెలియదూ! వెళ్ళవూ—మేరూ—వెళ్ళవూ?"

మేయర్ కళ్ళమ్మట నీళ్ళు ఉబికికొని వచ్చేసేయి.

"మరూ! కదలకుండా వుండమ్మా! ఇప్పుడు నిశ్చలతగా వుండకపోతే అంతా చెడిపోతుంది. ఉండవూ మరూ" ఆ కన్నీళ్ళ కంఠంతోనే అంది.

డాక్టరు బేండేజీ చుట్టేస్తూ "ఏమండోయి! ఈకట్టు వారం రోజులువరకూ విప్పకూడదు. తెలిసిందా" అన్నాడు.

"వారం రోజులే! పూర్తిగా వారం రోజులే. ఓ! ఆ జన్మాంతరం అని చెప్పలేక పోయేవా?" కొంచం కఠినంగానే అంది మరూ.

"వారం రోజులు. దాన్ని కదిపినా, పైకి ఎత్తినా...."

"ఒక్క క్షణమైనా ఎత్తకూడదా? కొంచెము పైకి తొయ్యకూడదా?"

"కాస్త ఏమాత్రం కదిల్చినా: మళ్ళీ ఇంక చూపురాదు. జాగ్రత్త."

"ఓ! డాక్టర్. ఎంత క్రూరంగా మాట్లాడు చున్నారు. ముందర ఎందుకు చెప్పేరు కారు? ఇది అంధత్వంకంటె ఎక్కువే! ఇది ఎంత ఆశ చూపిస్తుందో ఆలోచించేరా? ఇంతవరకూ నాపిల్లవాణ్ణి చూడలేదు తెలుసునా?"

కట్టు పూర్తిగా కట్టేసేరు.

"మీరు చెప్పినమాట వినండి. మళ్ళీ ఈవారంరోజున వస్తాను. అప్పుడు మీ అబ్బాయిని మీరు చూడగల్గుతారు. అబ్బాయినే కాదు, మీతండ్రిగారిని, ఆయాను, మేయర్‌ను—ఒక్కరేమిటి అందర్నీ చూస్తారు. అది నే చెప్పినట్లుగా చేస్తేనే లేక పోతే ఈ ప్రపంచంలో దేన్నీ చూడలేరు. ఆఖరుకి మీ అబ్బాయినేనా సరే! చూచినా ఒక్కక్షణం చూడకల్గుతారు తర్వాత పూర్తిగా ఆజన్మాంతరము అందులై పోతారు—లేకపోతే—అది ప్రాణాపాయం కూడా చేస్తే చెయ్యవచ్చు."

మరియమ్మ ఏమీ అనలేకపోయింది.

"క్షమించండి. తొందర్లో అనేసేను. అల్లాగే మీరు మళ్ళీ వచ్చి కట్టు విప్పేవరకూ నేను ముట్టుకోను. ఆఖర్కి నాకొడుకుకోసమైనాసరే. మీరే చూస్తారు కాదు అప్పుడు" అంది.

డాక్టర్లు బర్రుమంటూ వెళ్ళిపోయేరు మోటారుమీద.

* * *

రెండవ రోజు.

ఆరోజుకూడా మేయర్ మరియమ్మ యింట్లోనే వుండిపోయింది. జాన్ సంరక్షణ చూస్తూయుండడం, మరూకి కావలసినవన్నీ ఇస్తూయుండడము. జకరయ్యతో ఆకబురు ఈకబురు మాట్లాడ్డంతోటి గడిపేస్తోవుండేది. అన్నిపనులు అయినతర్వాత ఆ మధ్యాహ్నం మరియమ్మకు కావలసిన, పాలు, పండ్లు, జావ అన్నీ తెచ్చి, అవి తినిపించి, పక్కనే కూర్చుని.

"ఏం మరూ! ఇవ్వాళ ఎల్లా వుంది. నిన్నను కొంచం తలనొప్పిగా నుందన్నావు. ఇవ్వాళ తగ్గిందా? కులాసాగా వుందా?" అడిగింది.

"ఊ! తలనొప్పిలేదు. వేడిగా గాలి వేస్తున్నట్లుంది. ఎండ తగ్గలేదా?"

"లేదు."

ఇంతట్లోకే జకరయ్య మనుమడిని తీసుకొచ్చి కూతురు మంచందగ్గర కూర్చోపెట్టి

"అమ్మాయీ అల్లా ఊళ్ళోకి వెళ్ళి వస్తాను" అంటూ వెళ్ళిపోయేడు.

"అమ్మా....పాపయి...." అంటూ వస్తే, మేయరు మంచం ఎక్కించి కూర్చో పెట్టింది జాన్ చెయ్యిని తన చేతుల్లోకి తీసుకొని" ఎంత చిన్నవిగా వున్నాయో! మేరూ! ఎంత మెత్తగా దూది పింజల్లా వున్నాయో" అంది మరియమ్మ.

ఇదివరకల్లా కళ్ళకు ఏమీలేకుండా వుండే అమ్మకు ఇప్పుడు కళ్ళకు కట్టు వుండడం. తన యింటికి కొత్తగా మనుష్యులు రావడం, ఇదంతా చూడ్డంవల్లో, మరెందువల్లో కాని తల్లి దగ్గరసా జరిగి జాన్, తన కుడిచేత్తో ఆకళ్ళ కట్టు చూపిస్తూ "బర్....అమ్మా.... తీ...."అంటూ చూపించడం, అందం చెయ్య సాగేడు. ఒకటి రెండుసార్లు అది తను తీసెయ్యడానికి ప్రయిత్నిస్తే మరియమ్మ "వద్దునాన్నా! ముట్టుకోకూడదు" అంది.

కాని....మళ్ళీ "బర్"మని తుప్పర్లు ఊదడం, "అమ్మా....తీ" అని అందం మరియమ్మకు ఎల్లాగో ఆయిపోయింది.

తను చెయ్య ముట్టుకోకుండా తప్పించడం, దాంతోనే జాన్ పంతం ఎక్కువవ్వడము జరిగేటప్పటికి "మేరూ! నేను ముట్టుకోటంలేదు కదా! జాన్ దాన్ని పీకేస్తే నేను తీసుకొన్నట్టు కాదు కదూ....అది నేను డాక్టరుతో చేసిన బాసకు వ్యతిరిక్తం అవుతుందా" అంది.

మేయర్‌కు ఒక్కసారిగా ఆమె హృదయం తేటతెల్లమైపోయింది కాని.... "చేసినట్లే అవుతుందనుకొంటాను"అంది ఎల్లాగో స్వరభేధంతో.

వినపడేటట్లు నిట్టూర్పు విడిచింది మరియమ్మ. కాని "మేరూ ఒక్కసారి ఆలో

ధించు. ఆపని జాన్ చేసేడనుకో. డాక్టర్లు మాత్రం ఎమంటారేమిటి? చిన్నపిల్లాడు తెలియక చేసేడు అంటారు. ఎమంటావు? అంతేనా"

మేయరు మాట్లాడకుండా జాన్‌ను తీసుకొందామనుకొంది కాని మరూ ఆతన్ని దగ్గరసా తీసుకోవడం ఆమె తలంపుకు ఆటంకపరిచింది. "మరూ! జాన్‌ను ఇల్లా ఇయ్యి. అల్లా తిప్పి తీసుకొస్తా" అంది.

"ఉఫ్: ఎంత తప్పు ఆలోచన ప్రవేశించిందను కొన్నావు మేరూ; నాచిన్న జాన్ నాదగ్గరుండడం ఎంతో ఆశ కల్పించి, స్వర్గానికి ఎత్తేసిందనుకున్నావు. ఆచెడు తలంపు. దీనికి నీవు ఏమీ అనుకోవు కాదు? మేరూ?"

"బ్రూ....బుర్రూ—బర్ బర్ ...." ఆ చెయ్యి ఆకట్టుకేసే చూపిస్తూ అన్నాడు.

"ఓ! చూచేవా; మేరూ! బర్ మనడం వాడి ఉద్దేశ్యం కారుమీద వచ్చిన వాళ్ళని కాబోలు"

"ఉ: అందుకనే కాబోలు బర్.... అమ్మా....తీ—అందం, వాళ్ళు నీకు ఏమిటో చేసేరని, దాన్ని తీయమని కాబోలు....ఎన్ని ఊహలో...."

"అవును..అయితే నాచిన్న జాన్‌మాటల్లు అన్నీ పట్టుకొంటున్నాడన్నమాట! ఎంత ఉహల్తో నిండిపోయిందో ఆబ్బుర...." దగ్గిరసావున్న తలకాయను మరంత హృదయాన్ని హత్తుకుంది.

"ఉ...."

"అయితే వారంలోపుగా నా జాన్ కళ్లు, ముక్కు, చేతులు, కాళ్లు....ఇవన్నీ చూస్తాను కాదూ మేరూ!"

"అవును! భగవంతుడు అందర్నీ దయతో చూస్తాడు"

"ఆ! ప్రభువు కృప, మేరూ! జాన్ ఎవరి పోలికనుంటాడు?

"ఎవరి పోలికా? నీపోలికే........కాని ముక్కుమాత్రం నీదికాదు సుమీ"

మరియమ్మ లోపల నవ్వుకుంది,...ఓ మాదరిగా సంతోషం ఆ మొఖంలో. కన్పించింది.

*  *  *

నాలుగో రోజు.

అవ్వాళ పగలల్లా జాన్ తాత వళ్ళోను, మేయర్‌వళ్ళోను గడిపివేసేడు. సాయంత్రం అయేటప్పటికి కొంచం నలతగా ఉండడం వల్ల తల్లి దగ్గరకు వచ్చేసేడు, కొంచం సేపు మూలుగేడు. తర్వాత చలి అన్నట్లుగా వణికిపోయేడు. ఇంతట్లోకే అల్లా వెళ్ళిన మేయర్ వచ్చేసి ప్లానల్‌షర్టు అవీ తొడిగి, దుప్పటీ కప్పి ఉయ్యాల మంచలో పడుకోపెట్టింది.

మరియమ్మ దగ్గరసానే కూర్చొని "ఎం మేరూ! దిగనారుగా సున్నాడా?....నిద్రపోతున్నాడా?....ఏం మాట్లాడటం లేక పోతున్నాడు....కాని ఏడుస్తాడు, అప్పుడప్పుడు ముక్కుతూ దగ్గుతాడు....ఇల్లా సాయింత్రంనుంచీ...."

"ఆ ఏమీ లేదూ! కొంచం నలిగేడు అంతే" అంది మేరూ.

ఆ తెలియని మైకంలో, నిద్రలోకూడా, "బర్....అమ్మా....తీ...." అంటూ కలవరించడం ప్రారంభించేటప్పటికి...."మేరూ.. జాన్ నిద్రట్లో కలవరిస్తున్నాడు కాదూ?"

"ఉ....డాక్టరు దగ్గరనుంచి మందుతేడానికి బాబాయి వెళ్ళేడు....ఈపాటికి తెస్తూ ఉంటాడు....రేపు పొద్దున్నకి మళ్ళి యధాప్రకారంగా ఉంటాడు" అంది.

అల్లాటి కబుర్లలో అర్ధరాత్రి అయిపోయింది. అప్పటికి జాన్ నాడి బాగా తగ్గిపోయింది, దాంతోటి శ్వాసకూడా ధ్వని తగ్గిపోయింది. మరియమ్మ ఉయ్యాల్లోకి తల వంచి....ముక్కుదగ్గరసాపెట్టి— చూచింది; ఓ తెలియనటువంటటి ఆనందంతో పైకి తలతీసి...." మేరూ! జాన్ ఎంతగాఢంగా నిద్రపోతున్నాడనుకొన్నావు...."

మేరూ సమాధానం చెప్పలేకపోయింది:... ఆ కొద్దికాలంలోనే ఆరిపోనున్న దీపాన్ని గురించి.

"ఆ డాక్టర్లను వాళ్ళనుచూచి భయపడ్డాడు కాబోలు"

"అబ్బే లేదు మరూ!"

"అయితె జాన్ మళ్లా సుఖంగా రేపటికి లేచి తిరుగుతాడు కదూ?"

"అవును మరూ?" చెప్పలేక పోయింది. ఎంతో శ్రమతో ఆ ముక్కలు బయట పడ్డాయి, ఆమొఖం మీద ఎటువంటి సమాధానం వ్రాసిందో చదవడానికి ఆ అంధతల్లికి తోపించలేకపోయేర్లు.

"మేరు! ఏమైనా చిక్కి పోయేడా?" రహస్యంగా అడిగినట్లు అంది.

"కొంచం"

"ఆతని కాళ్ళు చేతులూ.... చల్లగా ఉన్నాయా? వేడిగా వున్నాయా?"

"మామూలుగానే ఉన్నాయి!....ఉండు దుప్పటీ సరిగా కప్పనీ...." తర్వాత మూగగా చాలాసేపు కూర్చున్నారు. గడియారం గోడమీద రెండు గంటలు కొట్టింది.. రెండు....

"మేరూ....వాళ్ల మేరి కూతురు........ రెండేళ్ల వయస్సుదేపోతే ఫాదర్‌ఏమన్నాడో నీకు తెలుసునా?....

ఆశ్చర్యపోయింది.........మేరూ!...."ఆ ఏమిటి?"

'అవును. ఫాదర్ నీకొడుకు ఇప్పుడు ప్రభువుదగ్గర దేవదూతగా ఉన్నాడంటే.... మేరీ ఎదురుతిరిగి నాకు నీదేవతలు, దేముడూ అక్కర్లేదు....నాకొడుకును నాకియ్యి"అంది ....తెలుసా:....

ఆఖరిమాటలు చెప్పేటప్పటికి కంఠంలో కన్నీరు శబ్దం విన్పించింది.

"ఓ....నా కుమారుణ్ణి గురించి తలచుకోవడం—అతను ఇంక కనపడడు, ఆతని మాటలు వినపడవు, ఆతనిమొఖం చూడలేనూ, ఆతని ఆటలులో పాల్గొనలేనూ—అనుకోవడం .... ఆలోచించుకోవడం.... మేరూ!....ఓ—అల్లా జరగదుకాదూ....భగవంతుడు అల్లా జరగనివ్వడుకాదూ?....ఆతణ్ణి నాజాన్‌కోసం ప్రార్ధిస్తాను....ఆతడిది ఈ ప్రపంచకమంతా అయినపుడు....నా చిన్నవాణ్ణి కాపాడ్డానికి ఆతడు ఎమంత లెక్కచేస్తాడు? ఆతను నాదగ్గరనుంచి తీసుకువెళ్ళడు కాదూ."

మేయర్ కంఠంలో ఎన్నో ఆలోచనలు, మాటలు వచ్చి నిశ్శబ్దమైపోయేయి. దాంతోనే ఆమె విచారంకూడా తెలియనియ్యకుండానే కుళ్ళించుకోవలసివచ్చింది....

మేరూ ఆమంచంలో తనచేతుల్తో జాన్‌ను తడుముతూ "ఓ ప్రభువా! ఈ నా కొడుకగు జాన్‌ను....ఎంతో ప్రేమతో పెంచుకొంటున్న ఒక్కగా నొక్క కొడుకగు జాన్‌ను....ఈ నలతనుండి కాపాడవూ? ప్రభువా, ఆతని చిన్నమోమే నాకు కరువయ్యిపోతే....నేను ఇంతవరకూ ఎల్లావుంటుందో చూడని ఆబిడ్డను....కాపాడవా! రక్షించవా! నేను చూచేవరకైనా....త్వరలో....ఇంక మూడురోజుల్లో....అ ం త వ ర కూ కాపాడవా?"

మేయర్ మరియమ్మ ప్రార్ధనకు అడ్డు చెప్పలేకపోయింది. ఆ కన్నీటిలోనే చూస్తూ, వింటూ....దేనికి ఆటంకపరచలేకపోయింది.

"మేరూ! నాకేదో గూఢంగా, నాపిల్లవాణ్ణినే చూ స్తే రక్షించగల్గుదునని చెపుతోంది.

ఒక్కసారిగా మేరూ భయపడిపోయింది. "లేదు. లేదు. అల్లాంటి ఆలోచననేమీ పెట్టుకోవద్దు."

"కాని ఏదో చెప్పినట్లు అయ్యింది. భగవంతుని ఆజ్ఞలా అయ్యింది. మనం భగవంతునిమాట వినాలికాదూ?"

"ఓ....అది భగవంతుడుకాడు. నీహృదయమే నీకల్లాచెప్పింది...."

"కాదు. నేను నిశ్చయంగా విన్నాను...."

"కాదు మరూ! అల్లా చేసినందువల్ల నీవు ఆజన్మాంతరము అంధురాలై పోతావు"

"అయినా....జాన్‌ను నేను రక్షించుకోగల్గుదును."

"లేవు, నీవు రక్షించుకోలేవు"

"ఆతడు ర క్షిం ప బ డ లేడంటావా? మేరూ!"

"ఒక్క దేముడికే తెలియాలి"

"అయితే ఆతడు నాకు చెప్పేడే....నా హృదయంలో ధ్వనించేడే....నువ్వు కూడా ఆతనికే తెలియాలన్నావే మరి...."

అల్లా కాలం జరిగేటప్పటికి...కొద్దికొద్దిగా వినిపించే శ్వాసశబ్దం తగ్గడం....అది వరకల్లా వచ్చేదగ్గు కనపడకపోవడం...చూచి మరియమ్మ ఉయ్యాలలోంచి చేతుల్లోకి తీసుకొంది. మేరూ జాన్ మొఖంలోకి చూచింది. అప్పుడే కదుపుతున్న పెదిమల్లోంచివచ్చే....

"నన్ను పిస్తున్నాడు కాబోలు" తన చెవి ఆ పెదిమల దగ్గరకు వంచుతూ మరియమ్మ, మేరూ....నిశ్శబ్దంలో గడిచిపోయింది....ఆమె సమాధానం....అంత్యదీపం వెల్తురు. మళ్లా పెదిమలు కదిలేయి...."మా అని పిలుస్తున్నాడు మళ్లీ" అంది. కాని ఇదివరకటి శబ్దంకూడా లేకుంటంవుంది అది.

మళ్ళీ పెదిమలు అల్లాడేయి, "ఓ....నన్ను పిలుస్తున్నాడు...." ఎంతో ఆతృత, వేదన కన్పించింది ఆమొఖంలో....ఆవేదన "వెళ్ళిపోతున్నాడు....ఆతన్ని వినగల్గుచున్నాను—దూరంగా....దూరదూరంగా వెళ్ళిపోతున్నాడు....జాన్ .... జా—...." తన మొ ఖా ని కి దగ్గరగా ఎ త్తి...."జాన్....జాన్...."

"మరూ! ఇల్లా ఇయ్యి అమ్మా" అంది మేరూ.

మరూ తన హృదయానికి మరంత దగ్గిరసా ఒ త్తుకుంటూ...."జాన్....జాన్" అంది.

ఒక్కసారిగా ఏదో మెరపుమెరసినట్లుగా అయ్యింది. కళ్ళకు కట్టినట్టు క్రిందపడిపోయింది. ఆక్షణంలోనే తనకొడుకు మొఖంలోకి ఆవేదన....దుఃఖం...ఆతృత...అన్నీకలసిన విడిన కళ్ళతో చూచింది.

"జాన్....జాన్...జాన్ ఉఫ్"....అంది.

ఆతల్లి తనకొడుకును ఆక్షణంలో చూడకల్గింది. ఆక్షణంలోనే తన భర్త పోలికలు ఆనవాలు కట్టకల్గింది....తృప్తి....

మరుక్షణంలో ఆజీవి దేవుని పదసన్నిధికి వెళ్ళిపోయింది. ఆడడికిపోయిన ఇంటి మధ్యలోంచి, నిర్జీవమైన శరీరాన్ని...రూపాన్ని...తన తల్లి చేతుల్లోపెట్టేసి.

మరియమ్మ అంతా చూచింది. తెప్పరిల్లింది. తనంతటతానే లేచి ఆనిర్జీవ ప్రతిమను ఉయ్యాల్లో పడుకోపెట్టింది. ఆతెల్లటి దుప్పటీ మొఖంపైకి లాగేసింది. ఆపాలిపోయిన మొఖంల్లోంచి....ఆ తెల్లబడ్డ పెదిమల్లోంచి............

"మేరూ! అంతా అయిపోయింది" అంది.

తనజీవనం అంతా అప్పుడు సింహావలోకం చేసుకొంది.... "మేరూ! రేపు వాళ్లు వస్తారూ....నన్ను నా పాపని చూస్తారు. కాని నాజాన్‌ను తీసుకెళ్ళనియ్యకుండాచెయ్యి....మనిద్దరంవెళ్ళి...."

చెప్పలేకపోయింది. తనకట్టుకన్పించింది; తనకళ్ళు రెండూ బరువెక్కి పీకినట్టుగా అయితే, తన రెండుచేతులుతోటి కప్పివుత్తూ...."నా జాన్ స్వర్గంలో ఉన్నాడనుకొంటాను....కాని భగవంతుణ్ణి ప్రార్ధించేను....నాకొడుకును ఈభూమిమీద ఒక్కసారి చూడనిమ్మని....ఎన్నోవిధాల ప్రా ర్ధి ం చే ను....ప్రభువవిన్నాడు....దాన్ని ఇచ్చేడు...కాని...నాకొడుకు చనిపోతుంటే చూడకల్గేను...." ఏడ్చింది.

* * *

ఆ తల్లి ప్రేమ ఈ పురుషులకేమి తెలుస్తుంది.

అప్పటినుండీ ఆమె అంధురాలైంది.